సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం ; 3 ; డిసెంబర్ ; 2024



అనుమానాస్పద స్థితిలో మృతి

ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామంలో రేవూరి వెంకటేష్ తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 8లో ▸



భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి

ఉమ్మడి పశ్చిమలో భక్తి శ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు నిర్వహించారు. కార్తీకమాసం చివరిరోజు సోమవారం రావడంతో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. 8లో ▸



దివ్యాంగుల ఎదుగుదలే హద్దుగా..

దివ్యాంగులకు సమాన అవకాశాలతో పాటు సమాజ అభివృద్ధిలో భాగం చేసే లక్ష్యంతో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. 8లో ▸

ధాన్యం.. దైన్యం

- చివరిలో హడలెత్తిస్తున్న ఫెంగల్ తుఫాను
- అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు
- ఇదే అదునుగా దోచుకుంటున్న మిల్లర్లు, దళారులు
- ఎకరానికి రూ.5 వేల వరకు నష్టపోతున్న రైతులు
- జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- 1.15 లక్షల ఎకరాల్లో పూర్తయిన వరికోతలు



పెనుగొండ-మార్టేరు రోడ్డులో రైతులు ధాన్యం ఆరబెట్టిన దృశ్యం

సాక్షి, భీమవరం: ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతులకు కష్టాలనే మిగిల్చింది. ప్రారంభంలో భారీ వర్షాలు, వరదలు.. చివరిలో ఫెంగల్ తుఫాను నష్టాన్ని మిగిల్చాయి. వాతావరణం ఎప్పుడెలా ఉంటుందోనన్న ఆందోళనతో రైతులు పంటను అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఇదే అదునుగా తేమ శాతం పేరిట మిల్లర్లు, దళారులు దోచుకుంటున్నారు. జిల్లాలోని రెండు లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు, వరదలు, తెగుళ్ల పంటకు నష్టం కలిగిస్తూ వచ్చాయి. పెట్టుబడులు పెరగడంతో పాటు జిల్లా సాధారణ దిగుబడి ఎకరాకు 35 బస్తాల (75 కిలోలు) నుంచి 30 బస్తాలకు తగ్గిపోయినట్టు అంచనా. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట ప్రాంతాల్లో కోతలు ముమ్మరం కాగా మిగిలిన చోట్ల మొదలయ్యాయి.

అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు

కామన్ వెరైటీ 75 కేజీల బస్తాకు రూ.1,725గా ప్రభుత్వం నిర్ణయించింది. **ఈ ధర పొందాలంటే ధాన్యంలో తేమశాతం 17 లోపు ఉండాలి. అంత కన్నా ఎక్కువగా ఉంటే మిల్లింగ్ చేసేటప్పుడు బియ్యంలో నూక శాతం ఎక్కువగా వస్తుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టే వీలులేక 20 వరకు తేమశాతం** ఉంటోంది. సాధారణంగా 17 శాతానికి మించి తేమ ఉన్నప్పుడు రైతులు, మిల్లర్లు నష్టపోకుండా పైన ప్రతి ఒక్క శాతానికి క్వింటాల్‌కు ఒక కేజీ చొప్పున ధాన్యాన్ని తరుగుగా మినహాయిస్తారు. ప్రస్తుతం 19 నుంచి 22 వరకు తేమశాతం ఉంటున్న నేపథ్యంలో 17 శాతానికి మించి అదనంగా ఉన్న ప్రతి ఒక్క శాతానికి ఒక కేజీ చొప్పున ధర తగ్గించి రైతుకు మద్దతు ధర మేరకు చెల్లింపులు చేయాలి. ప్రస్తుతం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,300 కాగా కేజీకి రూ.23గా ఉంది. ఈ మేరకు 19 శాతం తరుగు ఉంటే క్వింటాల్‌కు రూ.2,254, 20తేమ శాతం ఉంటే రూ.2,231, 22 శాతం ఉంటే 2,185 చొప్పున చెల్లింపులు చేయాలి. తేమశాతం ఎక్కువగా ఉందన్న సాకు చూపించి దళారులు, మిల్లర్లు క్వింటాల్‌ను రూ.రెండు వేల లోపే కొనుగోలు చేస్తున్నారు. 17 శాతం తేమ రావాలంటే రెండు మూడు రోజుల పాటు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి రావడంతో వాతావరణం ఎప్పుడెలా ఉంటుందోనన్న భయంతో చాలామంది రైతులు అయినకాడికి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకు రైతులు నష్టపోవాల్సి వస్తోందని అంచనా. సోమవారం వాతావరణం కొంత తెరిపివ్వడంతో జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల కళ్లాలు, రోడ్డు పక్కన ఉంచిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనుల్లోను, ఆరబెట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. మరోపక్క ధాన్యం రవాణా, హమాలీ ఖర్చులు ప్రభుత్వ నిర్ణీత ధర ప్రకారం.. బస్తాకు సుమారు రూ.50 వరకు ఉంటుంది. ప్రస్తుతం ఎవరికి వారు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో ఉండటంతో జట్టు కొరత పేరిట బస్తాకు రూ. 80 నుంచి రూ.90 వరకు వసూలు చేస్తున్నారు. బస్తాకు రూ.30 నుంచి రూ.40 అదనంగా చెల్లించాల్సి వస్తోంది.

బెంబేలెత్తించిన ఫెంగల్

జిల్లాలో 1.15 లక్షల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. తేమ శాతం తగ్గించుకునేందుకు ఎక్కడికక్కడ రైతులు ధాన్యాన్ని కళ్లాల్లో, రోడ్ల వెంట ఆరబెట్టుకుంటున్నారు. ఈ తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను రైతులను బెంబేలెత్తించింది. గత నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై చెదురుమదురుగా వర్షాలు పడుతుండటంతో పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఎక్కడిక్కడ వరికోతలు నిలిపివేయగా, కళ్లాలు, రోడ్లు వెంబడి ఉంచిన ధాన్యం తడవకుండా బరకాలు కప్పి ఉంచారు.



ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతు

న్యూస్‌రీల్

క్షీరారామలింగేశ్వరుడిని దర్శించుకున్న ఐఏఎస్‌లు



క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్

పాలకొల్లు అర్బన్: క్షీరారామలింగేశ్వరస్వామిని కార్తీక సోమవారం చివరి రోజున పలువురు ఐఏఎస్ అధికారులు దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి కె హర్షవర్ధన్, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి కె.ప్రద్యుమ్న దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

11 ఫిర్యాదుల స్వీకరణ



భీమవరంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బాధితుల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సరైన పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): అర్జీదారులు సంతృప్తి చెందేలా చక్కని పరిష్కారం చూపాలని జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగత బాధ్యతగా తీసుకుని ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 102 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టరు బి.శివనారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్.అప్పారావు పాల్గొన్నారు.

నరసాపురంలో జిల్లా యువ ఉత్సవ్



జిల్లా యువ ఉత్సవ్ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): యువత జిల్లా స్థాయి యువ ఉత్సవాలలో పాల్గొని తమ ప్రతిభ చాటాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. డిసెంబర్ 7న వైఎన్ కాలేజ్ నరసాపురంలో నిర్వహించనున్న 'జిల్లా యువ ఉత్సవ్' గోడ పత్రికను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియా-2047 అంశంపై ప్రసంగం, చిత్రలేఖనం, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ విభాగాలలో వ్యక్తిగత పోటీలు, ఇతర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9989316106 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

నేడు హెచ్‌ఎంల సమావేశం

భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశామని డీఈఓ నారాయణ సోమవారం తెలిపారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో 2025 మార్చి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు, ఇతర విద్యా అంశాలపై సమీక్షిస్తారన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసన



గొల్లలకోడేరులో నిరసన తెలుపుతున్న దళితులు

పాలకోడేరు: పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో దళితపేటకు దగ్గరలో మద్యం దుకాణం ఏర్పాటుకు మరోసారి ప్రయత్నిస్తుండడంతో దళితులు ఆందోళనకు దిగారు. తమ మనోభావాలు దెబ్బతినేలా ప్రార్థన మందిరాలకు, శ్మశానాలకు దగ్గరలో మద్యం దుకాణం ఏర్పాటు దుర్మార్గమని అన్నారు. గతంలో చేసిన ఆందోళనకు దిగివచ్చి మద్యం దుకాణం వేరే చోటుకి తరలిస్తామని చెప్పి మళ్లీ ఇక్కడే ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడం తమను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే చోటుకి తరలించేవరకూ ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి కూడా వెనకాడమని హెచ్చరించారు.

20 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

భీమవరం: భీమవరం పట్టణంలో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ తెలిపారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్ కాలంలో ప్రజా పోరాటాలకు సిద్ధమయ్యేలా పార్టీ సన్నద్ధమవుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సంవత్సరం ముగింపు సందర్భంగా భీమవరం పట్టణంలో 20న భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. 21, 22న ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు, చేతి వృత్తి దారులు, ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమించేలా ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

వచ్చే ఏడాది కార్మిక సెలవులు ఇవే

ఏలూరు (టూటౌన్): ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 1988 కింద జోన్-2లోని షాపులు ఎస్టాబ్లిష్‌మెంట్‌లో పనిచేసే ఉద్యోగులకు వేతనంతో కూడిన జాతీయ, పండుగ సెలవు దినాలు ప్రకటిస్తూ కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఏ.రాణి ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఏడాది జనవరి 26, మే 1, ఆగస్టు 15, అక్టోబరు 2 జాతీయ సెలవు దినాలు కాగా.. జనవరి 15, ఫిబ్రవరి 26, మార్చి 31, నవంబరు 1, డిసెంబరు 25 పండుగ సెలవుదినాలని ప్రకటించారు.

వాహన్ పోర్టల్ ద్వారానే రవాణా సేవలు



ఏలూరు (ఆర్‌ఆర్ పేట): వాహన దారులకు సంబంధించిన అన్ని రకాల రవాణా శాఖ సేవలను ఇకపై వాహన పోర్టల్ ద్వారానే పొందాలని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకూ ఈ-ప్రగతి పోర్టల్ ద్వారానే రవాణా శాఖ సేవలను అందించామని, సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ-ప్రగతి పోర్టల్ నిలిపివేసినట్టు తెలిపారు. దాని స్థానంలో వాహన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఇబ్బందులుంటే 9154294210, 91542 94105 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వసతి గృహం తనిఖీ



కాళ్లలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

కాళ్ల: కాళ్ళ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని డార్మెటరీలను పరిశీలించారు. టాయిలెట్ల సముదాయాన్ని స్వయంగా తనిఖీ చేశారు. భోజనం, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి తర్వాత ఐటీఐ చదువుతో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార పదార్థాలను రుచి చూశారు.

టీచర్‌పై చర్యలకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): విద్యార్థుల్ని కొట్టి కులం పేరుతో దూషించిన టీచర్ ఎం.ఎస్.వి.ముత్యాలరావును సస్పెండ్ చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ గత నెల 25న ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాల టీచర్ ఎంఎస్‌వీ ముత్యాలరావు పాఠశాల విద్యార్థులను వాతలు తేలేలా కొట్టాడన్నారు. నన్ను పేపర్లో ఎక్కిస్తారా.. తక్కువ కులం వాళ్లకి చదువు ఎందుకురా? అని నోటికొచ్చినట్లు దుర్భాషలాడాడని ఇదే విషయం పాఠశాల హెచ్‌ఎంకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. షోకాజ్ నోటీసు జారీ చేసి మూడు నాలుగు రోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే వేగంగా పూర్తి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వ్యాపార వినియోగ విద్యుత్ కనెక్షన్ల ఎంఎస్‌ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందితో గూగుల్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ సర్వేకు సంబంధించి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజస్ పారిశ్రామిక వేత్తలు సర్వేకు పూర్తిగా సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇంతవరకు బ్యాంకు ఖాతాలకు 87 శాతం ఎన్‌పీసీఐలు అనుసంధానం చేశామన్నారు. అత్తిలి, ఆకివీడు, యలమంచిలి, పోడూరు, తాడేపల్లిగూడెం అర్బన్, పెనుమంట్ర, నరసాపురం మండలాల్లో సర్వే పురోగతిని పెంచాలన్నారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగ్‌లో ఆకివీడు, పోడూరు, గణపవరం, నరసాపురం, పెంటపాడు, మండలాలు భీమవరం , తాడేపల్లిగూడెం వెనుకబడి ఉన్నాయన్నారు.

9 నుంచి ఉండి రైల్వే గేటు మూసివేత

ఉండి: రైల్వే ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 9 ఉదయం 7 గంటల నుంచి 18 సాయంత్రం 7 గంటల వరకు ఉండి రైల్వే గేటును మూసి వేస్తున్నట్లు సెక్షన్ ఇంజనీర్ ఎండీ రెహమాన్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతులతో పాటు గేటు వద్ద రోడ్డు మరమ్మతు చేపడుతున్నామని చెప్పారు.

నిరుద్యోగ భృతికి ఎసరు!

- నైపుణ్య గణన పేరుతో సాగదీతకు కుట్ర
- వెంటనే హామీ అమలు చేయాలని డిమాండ్



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నిరుద్యోగులకు తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.3 వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు అసలు దాని ఊసు ఎత్తడం లేదు. నైపుణ్య గణన పేరుతో సర్వే చేయించాలని.. అప్పుడు గానీ స్పష్టతకు రాలేనని చెబుతూ సర్వే పేరిట కాలాన్ని వెల్లదీసేందుకు పెద్ద స్కెచ్ వేశారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 55 వేల మంది నిరుద్యోగులు

యువజన సంఘాల లెక్కల ప్రకారం ఏలూరు జిల్లాలో సుమారు 55 వేల మంది నిరుద్యోగులున్నారు. వారిలో కొంతమంది డీఎస్సీ కోసం గత కొన్నేళ్లుగా కోచింగ్ తీసుకుంటున్నారు. గ్రూప్ -2 తదితర పోటీ పరీక్షలకు మరికొంతమంది సిద్ధమవుతున్నారు. ఏటా ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, వంటి కోర్సులతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి సాంకేతిక కోర్సులు చేసి దాదాపు 50 వేల మందికి పైగా పట్టాలు పట్టుకుని బయటకు వస్తున్నారు. వారిలో 20 శాతం మందికే ఆశించిన కొలువులు లభిస్తుండగా 15 నుంచి 20 శాతం మంది చదువుకు సంబంధం లేని రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. మిగిలిన 60 శాతం మంది ఎలాంటి ఉపాధి లేక సతమతమవుతున్నారు. ఇటువంటి వారి ఓట్లు కొల్లగొట్టేందుకే చంద్రబాబు ఎన్నికల్లో 5 ఏళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు, అప్పటి వరకు నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలనెలా రూ.1,500 అందిస్తానని హామీ ఇచ్చారు.

నిరుద్యోగ భృతికి ఎసరు పెట్టేందుకే

మహిళల్లో కూడా నిరుద్యోగులు ఉంటే వారికి మహిళా సాధికారిత కింద రూ.1,500 ఇచ్చి నిరుద్యోగ భృతిలో ఖర్చు తగ్గించే ఆలోచన చేస్తున్నట్టు భావిస్తున్నారు.

మండల స్థాయిలో శిక్షణతో సరి

సర్వేతో కాలయాపన చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం తొలి అంకంగా మండల స్థాయిలో కొంతమందికి సర్వేపై శిక్షణ ఇచ్చింది. సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ సెక్రటరీలు ఇలా సచివాలయంలో పని చేసే వారిని కొంతమందిని ఎంపిక చేశారు. వీరు ఇంటింటికీ వెళ్లి అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, ఉద్యోగులు, చదువుకుని ఉద్యోగం రాని వారు, ఉద్యోగం సంఘటిత రంగమా, అసంఘటిత రంగమా, నిరుద్యోగుల విద్యార్హతలు వంటి 25 రకాల ప్రశ్నల ద్వారా ట్యాబ్‌లో సమాచారం సేకరించాలి. సంఘటిత రంగంలో ఉద్యోగాలు చేస్తున్న వారి పీఎఫ్ ఖాతాలు, సంఘటిత రంగంలో ఉంటే ఈ-శ్రమ్ ద్వారా వివరాలు తీసుకోవాలి. నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా జిల్లా వ్యాప్తంగా సర్వే ద్వారా సమాచారం సేకరించి విశ్లేషణ చేసేందుకు దాదాపు ఏడాది సమయం పడుతుందని నైపుణ్యాభివద్ధి సంస్థ అంచనా వేస్తోంది.

నైపుణ్య గణన పేరిట సాగదీత

ఎవరికి ఎందులో నైపుణ్య శిక్షణ అవసరమో గుర్తించిన అనంతరం నైపుణ్య కళాశాలలు, హబ్‌లు, కొత్తగా కళాశాలలు, వర్సిటీల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు, శిక్షణ తర్వాత అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇస్తారని కలరింగ్ ఇస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత వెబ్‌సైట్ అందుబాటులో ఉంచితే, కొత్తగా మార్కెట్లోకి వచ్చే వారికి అవసరమైన నిరుద్యోగులకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. ఈ వ్యవహారమంతా నిరుద్యోగులకు రూ. 3 వేలు ఇస్తానని చేసిన వాగ్దానం కనీసం ఏడాది పాటు సాగదీసేందుకేనని అందరికీ స్పష్టంగా అర్థమవుతోంది.

డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నా..



నేను డిగ్రీ పూర్తి చేశాను. చదువుకు తగ్గ ఉద్యోగం దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఉపాధి కోసం ఒక బహుళజాతి సంస్థలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాను. ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకపోతే మాలాంటి వారికి ఉద్యోగం ఒక కలగానే మిగిలిపోతుంది. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తామని ఇచ్చిన హామీకి ఆకర్షితుడనై కూటమికి అనుకూలంగా ఓటు వేసి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాను.

– ఎస్‌కే ఇమ్రాన్, డిగ్రీ పట్టభద్రుడు

ఇచ్చిన హామీని నెరవేర్చాలి



ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని తక్షణం నెరవేర్చాలి. అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా తన హామీపై ఇంతవరకూ స్పందించకపోవడం నిరుద్యోగులను వంచించడమే. ఈ పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టంగా ప్రకటించాలి. దానితో పాటు పథకం ఎప్పటి నుంచి అమలు చేసినా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బకాయిగా పరిగణించి అన్ని నెలలకు సంబంధించిన రూ.3 వేలను అందించాలి.

– జీ సూర్య కిరణ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

'మహా పరినిర్వాన్ దివస్'కు సుబ్బయ్యకు ఆహ్వానం


గరికిముక్కు సుబ్బయ్య

భీమవరం : బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పార్లమెంట్‌లో ఈనెల 6వ తేదీన నిర్వహించే 69వ మహా పరినిర్వాన్ దివస్ కార్యక్రమానికి భీమవరం పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్యకు ఆహ్వానం అందింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, అంబేడ్కర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో పాటు పలువురు మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరవుతుండగా అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్మన్ వీరేంద్రకుమార్ నుంచి తనకు ప్రత్యేక ఆహ్వానం అందినట్లు సుబ్బయ్య తెలిపారు.

మోటార్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలు


గాయపడిన అఖిల్

పెనుమంట్ర: కారు, మోటార్‌సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. పెనుమంట్ర మండలం భట్లమగుటూరు గ్రామం వద్ద స్టేట్‌హైవేలో సోమవారం కారు, మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న సిర్ర అఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్ నుజ్జు కాగా, కారు ముందుభాగం దెబ్బతింది.

ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఇద్దరు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. సీఎస్‌సీ విభాగానికి చెందిన బి.సంజయ్, ఎం.భవ్యశ్రీ సర్కిల్ యాప్ ఆన్‌లైన్ ప్రైవేట్ సర్వీస్ లిమిటెడ్‌కు వీరు ఎంపికయ్యారు. వీరికి ఇంటర్న్‌షిప్ ఆరు నెలల పాటు ఉండగా, నెలకు రూ.30వేల స్టైఫండ్ అందించనున్నారు. అనంతరం ఏడాదికి రూ.16 లక్షల వేతనాన్ని సంస్థ చెల్లించనుంది. బెంగళూరు కేంద్రంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్లుగా వారు పనిచేయనున్నారు. విద్యార్థులను నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, యూనివర్సిటీ డీన్ శ్రావణి అభినందించారు.


పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


పెనుమంట్ర : గోస్తనీలో కార్తీక దీపాలను వదులుతూ..

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు జరిగాయి. కార్తీకమాసం చివరిరోజు సోమవారం రావడంతో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరిలో దీపాలు వదిలారు. అనంతరం పరమేశ్వరుడిని దర్శించి పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్


నరసాపురం: గోదావరి వలంధర్ రేవులో తెల్లవారుజామున పూజలు చేస్తున్న భక్తులు

దివ్యాంగుల ఎదుగుదలే హద్దుగా..

- దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం


భవిత సెంటర్‌లో దివ్యాంగులకు బోధన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : దివ్యాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, దివ్యాంగులకు వివిధ ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందించడం, చిన్నారులకు బిస్కెట్లు, క్రీడా సామాగ్రి, విద్యా సామాగ్రి ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

దివ్యాంగుల జీవితాల్లో చిరుదివ్వెలు

భవిత సెంటర్‌లు దివ్యాంగుల జీవితాల్లో చిరుదివ్వెలు వెలిగిస్తున్నాయి. భవిత కేంద్రంలోని ఐఈఆర్‌టీ (ప్రత్యేక టీచర్లు)లు, ఆయాలు దివ్యాంగులకు విలువైన సేవలు అందిస్తున్నారు. అడుగుతీసి.. అడుగు వేయలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు నడక నేర్పి విద్యాబుద్ధులు అందిస్తున్నారు. దృష్టిలోపం కలిగిన వారికి బ్రెయిలీ లిపీలో బోధిస్తున్నారు. చెవిటి, మూగ వంటి సమస్యలు ఉన్నవారికి స్పీచ్ థెరపీ, వినికిడి యంత్రాలు ఇస్తున్నారు. నడక సరిగా రాని పిల్లల కోసం రోలేటర్స్, హ్యాండ్ స్టిక్‌లు, జంపింగ్ టేబుల్, తదితర ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయి. మనోవికాసం వృద్ధి చేందేలా గణిత భావనలు గుర్తుండేలా పూసల చట్రాలు, ఇతర ఆట వస్తువులు ఉన్నాయి. తీవ్ర వైకల్యంతో మంచానికి పరిమితమై ఉన్నవారికి ప్రతి శనివారం ఇంటి వద్దే ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, నడవడానికి వీలైన మోటార్ ఎక్సర్‌సైజ్స్ అందిస్తారు. ముఖ్యంగా డిజిటల్ సేవలు, లైఫ్ స్కిల్స్ అందిస్తున్నారు. బుద్ధి మాంద్యం కలిగిన వారికి ఎంఆర్ కిట్‌లు అందుబాటులో ఉన్నాయి.

జిల్లాలో 3,298 మంది దివ్యాంగులు

జిల్లాలో సుమారు 3,288 మంది దివ్యాంగుల పిల్లలు ఉన్నారు. ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రం ఏర్పాటు చేశారు. 20 భవిత కేంద్రాల్లో 400 మంది దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. 200 మంది దివ్యాంగుల పిల్లలకు అతి తీవ్రత వైకల్యం ఉండటంతో పాఠశాలకు రాలేని పిల్లలకు ప్రతి శనివారం ఇంటి వద్ద ప్రత్యేక బోధన అందిస్తున్నారు. ఈ పిల్లల నిమిత్తం 40 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు, 7 గురు ఫిజియోథెరపీలు, 20 మంది ఆయాలు, వివిధ స్కూళ్లలో 26 మంది స్కూల్ అసిస్టెంట్లు దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

వైద్య నిర్ధారణ శిబిరాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన బాల బాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం వైద్య నిర్ధారణ శిబిరం సంవత్సరానికి ఒకసారి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో గుర్తించిన దివ్యాంగులకు హియిరింగ్ ఎయిడ్స్, కాలిపర్స్, హ్యాండ్ స్టిక్స్, వీల్ చైర్స్, రోలేటర్స్, వినికిడి యంత్రాలు, టీపీ చైర్స్, సంక కర్రలు వంటి పరికరాలను ఉచితంగా అందిస్తున్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి



దివ్యాంగుల పిల్లల లోపాన్ని చూసి తల్లిదండ్రులు కుంగిపోకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలి. పిల్లల సంరక్షణపై మరింత బాధ్యత వహించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి. దివ్యాంగులకు పరీక్షల్లోను, ఉద్యోగాల్లో ఉన్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి.

– పి.శ్యాంసుందర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్

ప్రవర్తనలో మంచి మార్పు వచ్చింది



మా అబ్బాయి పేరు ఎ.బాలనాగేంద్ర కుమార్. సెబ్రల్ పాలసీ వైకల్యం లోపంతో జన్మించాడు. భవిత సెంటర్‌లో చేర్పినినాటి నుంచి చదవడం, రాయడం, కూడికలు చేయడం, రైమ్స్ చెబుతున్నాడు. పిల్లాడి ప్రవర్తనలో మంచి మార్పు రావడం చాలా సంతోషంగా ఉంది. సమగ్ర శిక్షకు, భవిత కేంద్రానికి ధన్యవాదాలు.

– ఎ.వెంకటలక్ష్మి, తల్లి, తాడేపల్లిగూడెం

అత్యాచారం కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): అత్యాచారం కేసులో ముద్దాయికి పదేళ్ల కారాగార శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ ఏలూరు మహిళా కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి సోమవారం తీర్పు వెల్లడించారు. మహిళా కోర్టు ఏపీపీ డీవీ రామాంజనేయులు, పోలీసులు తెలిపిన వివరాలివి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం గుమ్ములూరు ప్రాంతానికి చెందిన గండికోట తరుణ్ సీసలి గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తరువాత ఆమెను పెండ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. ఆమె తల్లిదండ్రులు పెద్దల్లో పెట్టి అడిగించినా ఒప్పుకోలేదు. దీంతో భీమవరం రెండవ పట్టణ పోలీసు స్టేషనులో మే 10, 2022న బాధిత యువతి ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ బి.కృష్ణకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు తరుణ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, పూర్తి దర్యాప్తు రిపోర్టును కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో బాధితురాలి తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ఏలూరు మహిళా కోర్టు 5వ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి ముద్దాయి గండికోట తరుణ్‌కి పదేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ముద్దాయి తల్లిదండ్రులపై ఉన్న ఆరోపణలు నిరూపణ కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేసినట్లు ఏపీపీ తెలిపారు.

త్వరలో మాల మహానాడు సభ

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా త్వరలో రాష్ట్రంలో మాల మహానాడు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఎమ్మెల్యే వివేక్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో తొలుత ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఏపీలో మాల ప్రజాప్రతినిధులను ఉత్తేజ పరిచే విధంగా ప్రత్యేక సమావేశం నిర్వహించి భారీ సభ నిర్వహిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో వెంకటేష్ మృతదేహం

ద్వారకాతిరుమల: ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన కథనం ప్రకారం. జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రేవూరి వెంకటేష్(43) కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో కుమార్తెను తీసుకుని ఏడాదిన్నర క్రితం అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా ఆదివారం రాత్రి వెంకటేష్ మద్యం సేవించి, ఇంట్లోని తన పోర్షన్‌లో తలుపులకు గడియ పెట్టుకుని నిద్రించాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో అతని తల్లిదండ్రులు కిటికీలోంచి చూడగా, మృతుడు కింద పడిపోయి, అతనిపై మంచం పడి ఉండడాన్ని గమనించారు. స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి అప్పటికే అతడు మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సత్యన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

8న క్రీడా జ్ఞాన పరీక్ష

ఏలూరు రూరల్: ఈ నెల 8వ తేదీన క్రీడా జ్ఞాన పరీక్ష జరగనుందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు చైతన్య కస్యప్ ఫౌండేషన్ సహకారంతో ఆన్‌లైన్‌లో ఈ పోటీ జరుగుతుందన్నారు. 12 ఏళ్ల పైబడిన బాల బాలికలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, పౌరులు ప్రతి ఒక్కరూ పోటీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన వారికి క్రీడాభారతి అవార్డుతో పాటు మొదటస్థానం సాధించిన వారికి రూ.లక్ష, రెండో స్థానంలో నిలిచిన ఇద్దరికి రూ.50 వేల చొప్పున, మూడోస్థానంలో నిలిచిన 6గురికి రూ.25 వేల చొప్పున, నాల్గో స్థానంలో నిలిచిన 11 మందికి రూ.11 వేలు చొప్పున నగదు బహుమతులు అందిస్తారని వివరించారు. 25 నిమిషాలు నిర్వహించే పరీక్షలో 50 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. పోటీదారులు ముందుగా హెటీపీపీ క్రీడాభారతి ఆర్గనైజేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య


మృతుడు వెంకటేష్

కైకలూరు : మద్యం మత్తుకు అలవాటుపడిన కుమారుడిని తల్లి మందలించడంతో మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరుకు చెందిన నాదేళ్ళ వెంకటేష్(28) తల్లి నాగమణితో కలసి సంతమార్కెట్ సమీపంలో అద్దె ఇంటిలో నివసిస్తున్నాడు. వెంకటేష్ కూలి పనులకు వెళతాడు. తండ్రి కొంతకాలం క్రితం మరణించాడు. మద్యం అలవాటును మానుకోవాలని వెంకటేష్‌కి తల్లి పదేపదే చెబుతోంది. దీంతో ఆమె బయటకువెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై మల్లిఖార్జునరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని డ్రోన్ కెమేరాతో చిత్రీకరించిన ఒక యూట్యూబర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. వివరాల ప్రకారం. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం, పరిసర ప్రాంతాలను ఒక యూట్యూబర్ డ్రోన్ కెమేరాతో చిత్రీకరించి తన యూట్యూబ్ ఛానల్, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. దీనిపై ఆరా తీయగా ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, ఊటుకూరు గ్రామానికి చెందిన యూట్యూబర్ వన్నెంరెడ్డి హరినాథ్ ఈ వీడియోలను తన హరినాథ్ ఫిలిమ్స్ అడ్రస్‌లో అప్‌లోడ్ చేసినట్టు తెలిసిందని ఆలయ ఏఈఓ పి.నటరాజారావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని వల్ల ఆలయ భద్రతకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనాల సీజ్

పెదపాడు : కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ఏడు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కోళ్ల వ్యర్థాల వాహనాలను పట్టుకున్నట్లు చెప్పారు. వాహనాల డ్రైవర్లు, వాహన యజమాని, చెరువు యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి

కొయ్యలగూడెం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఓ మోటార్‌సైక్లిస్టు మృతి చెందాడు. ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి. అచ్యుతాపురం గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన సిగ్నల్ లేకుండా ట్రాక్టర్ ఆగి ఉంది. టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న కూరగాయల వ్యాపారి జక్కు గంగరాజు (53) ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని గోపాలపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ గుండాల రమేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

కాళ్ల : వివాహిత అదృశ్యంపై ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొండాడపేట గ్రామానికి చెందిన ఆకురాతి జ్యోత్స్నదేవి (27) గత నెల 18వ తేదీన అదే గ్రామంలోని పుట్టింటికి అని చెప్పి వెళ్లింది. అయితే అప్పటినుంచి ఇప్పటివరకు ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త గణపతి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీన్ వద్ద గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైందని పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడు ఎరుపురంగు టీషర్టు ధరించి ఉన్నాడని, కుడిచేతికి ఒక స్టీల్ కడియం ఉందని చెప్పారు. వివరాలు తెలిసినవారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కళ్లాల్లోనే ధాన్యం.. రైతు కళ్లల్లో దైన్యం

- ధాన్యం కొనేదెప్పుడు?
- కళ్లాల్లో నెట్టలు వేసి ఉన్న ధాన్యం బస్తాలు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం!
- రైతులకు గాలం వేస్తున్న దళారులు


ధాన్యాన్ని వాహనంలో లోడ్ చేస్తున్న చిత్రం

తాడేపల్లిగూడెం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో జాప్యం నెలకుంది. అధికారులు ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించలేదు. దీంతో దళారీలు రైతులకు గాలం వేస్తున్నారు. పూర్తిస్థాయిలో వరికోతలు కాలేదనే కారణంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ముమ్మురంగా కోతలు జరుగుతున్నాయి. అలాగే పొలాల్లో ధాన్యం రాశులు ఉండడం కనిపిస్తోంది. దీంతో అప్పుడే దళారులు రైతులను ఆశ్రయించి దగా చేయాలని చూస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిబంధనలు తీసేశారు. మద్దతు ధర వస్తే మిల్లర్లు, బయట ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద అమ్మకాలు చేసుకోవచ్చనే ప్రభుత్వ నిబంధనలు రైతులకు మంచి చేస్తాయో..నష్టం కలిగిస్తాయో..ఎటు వైపు దారి తీస్తాయో వేచి చూడాలి. గూడెం నియోజకవర్గంలో ఖరీఫ్ సరాసరి దిగుబడి ఎకరాకు 32 బస్తాలుగా అంచనా వేశారు. ఈ లెక్కన గూడెం పట్టణం, మండలం కలిపి 51,621 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగలదని అంచనావేశారు. 22 రైతు సేవా కేంద్రాల ద్వారా 25,386 టన్నులు కొనుగోలు చేసినట్టుగా అంకెల్లో చూపించారు. అంచనా వేసిన పంటలో ఈ కొనుగోలు శాతం 49.18. వాస్తవానికి మండలంలో కేవలం ఐదు శాతం మాత్రమే మాసూళ్లు పూర్తి కావాల్సి ఉంది. అంటే కొనుగోలు చేసిన దానికి , రావాల్సిన పంటకు మధ్య ఉన్న వ్యత్యాసం తాలూకా ధాన్యం దళారులు కొనుగోలు చేసినట్టే. పెంటపాడు మండలంలో 40,977 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు రాగలవని అంచనా వేశారు. రైతు సేవా కేంద్రాల లెక్కల ప్రకారం ఈ మండలంలో 34,216 టన్నులు కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపించారు. అనధికారికంగా ఈ లెక్కల్లో దళారులు కొనుగోలు చేసిన ధాన్యం లెక్కలు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 83.50 శాతం ధాన్యం కొనుగోలు చేశారు.

నాలుగు వినతుల స్వీకరణ


మునిసిపల్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ఎం.ఏసుబాబు అధికారులు

తాడేపల్లిగూడెం: మున్సిపాల్టీలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో నాలుగు వినతులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండు , పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి రెండు వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి

తణుకు టౌన్: కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జీ ప్రేమ్‌కుమార్ చెప్పారు. సోమవారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ 1984 బోపాల్ గ్యాస్ దుర్ఘటనలో మరణించిన వారి జ్ఞాపకార్థం ప్రతి ఏటా డిసెంబరు 2న జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కాలుష్యం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 7 మిలియన్ల మంది మరణిస్తున్నారని చెప్పారు. పర్యావరణంలోకి హానికరమైన పదార్థాలను విడుదల చేయడం కారణంగా కాలుష్యం పెరుగుతుందని, దానిని నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జీ వాణి, డాక్టర్ కే రవీంద్రబాబు, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో దళారులదే రాజ్యం


తేతలిలో ధాన్యాన్ని సంచుల్లో లోడ్ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఆరుగాలం శ్రమ రైతుకు అక్కరకు రావడంలేదు. ఎండనక, వాననక పొలాలను దున్నినా, విత్తు చల్లినా, పంట పండించినా శ్రమ ఫలించి పంట చేతికి వచ్చే సరికి దళారులదే రాజ్యం. ప్రభుత్వాలు ధాన్యం కొనుగోళ్లలో కనీస మద్దతు ధర ప్రకటించినా ఆ ధర రైతులకు చెల్లించడానికి సవాలక్ష ఆంక్షలు. ధాన్యంలో ఆరుదల లేదని, తేమ శాతం 21కు పైగా ఉందని, తాళు, తప్ప ఉందనే అకారణాలతో ఎంత వరకు కోత విధించవచ్చు అంత కోత విధించి రైతుల దగ్గర ఆ మేరకు శ్రమదోపిడీ చేసి రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. ఖరీఫ్ 2024–25 చూస్తే ఈ దగాను రైతులు ఎదుర్కోవాల్సి వచ్చింది.ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం అనాదిగా ధాన్యం వ్యాపారులు, ఎరువుల అమ్మకాలు సాగించే వారు. పెట్టుబడులు పెట్టే వారే రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వీరి చెప్పిందే తక్కువైనా ఎక్కువైనా ధర. రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేసింది మాత్రమే వాస్తవంగా దళారులే.తణుకు నియోజకవర్గంలో మొత్తం 38,291 వేల ఎకరాలలో వరి సాగు చేయగా 85శాతం మాసూళ్ల పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వరి పంట పండించే రైతులలో ఎక్కువగా కౌలు రైతులే కావడంతో వారికి పెట్టుబడులన్నీ అప్పులపై ఉంటాయని, అప్పులను త్వరగా తీర్చాలనే ఆతృతతో తక్కువ రేటుకే తమ ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని రైతులు పేర్కొంటున్నారు.

ఆరబెట్టలేక రూ.1430కే అమ్ముకున్నా



వరి ధాన్యానికి తేమ శాతం 17 శాతం మేర ఉండాలనే నిబంధనతో వర్షాకాలంలో ధాన్యం ఆరబెట్టాలంటే రెండు మూడు రోజులు పడుతుంది. అంత ఆలస్యం జరిగినా కొత్తగా నాటిన పీఆర్ 136 రకం వరి దిగుబడికి తూకం తగ్గుతుందని ఆరబెట్టకుండానే రైస్ మిల్లుకు రూ.1430 అమ్మేశా.

– పాకా శ్రీను, ముద్దాపురం, రైతు.

ప్రైవేటు పాఠశాలల బస్సులు ఢీ

- స్వల్పగాయాలతో బయటపడ్డ చిన్నారులు
- 108 ద్వారా ఆస్పత్రికి తరలించిన వైనం



అర్జునుడుపాలెంలో రెండు బస్సులు ఢీకొట్టుకున్న దృశ్యం


చిన్నారులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రైవేటు పాఠశాలల బస్సులు రెండు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకున్న ఘటన ఇరగవరం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం అర్జునుడుపాలెం రోడ్డులో విద్యార్థులతో పాఠశాలకు వెళ్తున్న రెండు బస్సులు వేగంగా ఢీకొట్టుకోవడంతో బస్సుల్లో ఉన్న చిన్నారులు చెల్లాచెదురుగా పడిపోయారు. అయితే ఘటనలో బస్సులు వేగంగా ఢీకొట్టుకున్నప్పటికీ విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడడంతో స్థానికులు, తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం చూసిన చిన్నారుల రోదనలు మిన్నంటాయి. చిన్నపాటి గాయాలైన చిన్నారులను 108 వాహనం ద్వారా ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స చేయించి ఇంటికి పంపించినట్లు తెలుస్తోంది. ప్రమాదవార్త తెలుసుకున్న చిన్నారుల తల్లితండ్రులు ఆందోళనతో ఘటనా ప్రాంతానికి తరలివచ్చారు. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రైవేటు బస్సులు ప్రయాణిస్తున్న తీరు వివాదాస్పదంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. విద్యార్థులతో బయలుదేరుతున్న బస్సుల వేగానికి పాదచారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారని ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్సులు ఢీకొట్టుకున్న ఘటనలో అదృష్టవశాత్తూ పెనుప్రమాదం జరగలేదని ఏదైనా జరిగిఉంటే ఎవరు బాధ్యతవహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థులు చదువే శ్వాసగా సాగాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో మురళీసత్యనారాయణ

తణుకు అర్బన్: మానవ హక్కులు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వంటి రాజ్యాంగ విలువలపై విద్యార్థులు అవగాహన కలిగించుకోవాలని డీవైఈవో డి.మురళి సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ బానిస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఏకేటీపీ జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థి దశలో స్మార్ట్‌ఫోన్‌లు, సినిమాలు, టీవీ సీరియల్స్‌కు బానిసలు కాకుండా చదువును శ్వాసగా తీసుకుని జీవించాలని పిలుపునిచ్చారు. మంచి అలవాట్లకు బానిసలుగా మారాలని, చెడు అలవాట్లను దగ్గరకు రానీయవద్దని స్పష్టం చేశారు. సభాధ్యక్షుడు పాఠశాల హెచ్‌ఎం తాళాబత్తుల రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు బానిసగా బ్రతుకుతున్నారని నివేదికలు చెబుతున్నట్లుగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంటే మంగ తాయారు, పి.విజయలక్ష్మి, ఎస్‌కే రజియా, శాంతి లత, భాస్కర్, వీవీఎల్ఆర్‌కే కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

భూపతిరాజు సుబ్బరాజుకు ఘన నివాళులు


తణుకులో భూపతిరాజు సుబ్బరాజు చిత్రపటం వద్ద నినదిస్తున్న సీపీఐ నాయకులు

తణుకు అర్బన్: కమ్యూనిస్టు పార్టీ ఆశయసాధనే లక్ష్యంగా ఆర్థిక అసమానతలు, కుల, మత వివక్షతలు లేని సమసమాజా స్థాపనకు భూపతిరాజు సుబ్బరాజు అంకితభావంతో పనిచేశారని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సీపీఐ నేత, స్వాతంత్ర్య సమరయోధులు భూపతిరాజు సుబ్బరాజు 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం తణుకు కామ్రేడ్ వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ తణుకులో కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి సుబ్బరాజు శక్తివంచన లేకుండా కృషి చేశారని అన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతాంగ సమస్యల పరిష్కారానికి ఎంతగానో శ్రమించారని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపిన మహనీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ నాయకులు గార ప్రసాద్, డీవీఎస్ హనుమంతరావు, బొద్దాని మురళి కృష్ణ, బొద్దాని కృష్ణకిషోర్, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


తణుకులో విద్యార్థినీకి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినీకి కళాశాల ఫీజుల నిమిత్తం తణుకు మానవత సంస్థ ద్వారా సంస్థ సభ్యులు ఎంఆర్ కోటేశ్వరరావు కుమార్తె వినీత సాయి స్వేత రూ.ఐదు వేలు విరాళంగా అందజేసినట్లు ఆసంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. సోమవారం తణుకులోని గమిని ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో తణుకులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ జీ భవానీకి తన కళాశాల ఫీజుల నిమిత్తం ఐదు వేల రూపాయల చెక్కును అందజేసినట్లు తెలిపారు. మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, ఉపాధ్యక్షుడు కే రాజరాజేశ్వరరావు, కార్యదర్శి బీ రామకాశీ, వీవీ హనుమంతరావు, ఆలపాటి నాగేశ్వరరావు, ఆకుల శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


అత్తిలిలో సీపీఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

అత్తిలి: అత్తిలి రైల్వేస్టేషన్‌లో కేవలం పాసింజర్ రైళ్లు ఆగటం, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయకపోవడం బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాల్లో భాగమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాలయ బాబూరావు అన్నారు. సోమవారం అత్తిలి సుందరయ్య విజ్ఞాన భవనంలో సీపీఎం 3వ మహాసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేసైనా అత్తిలి రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలన్నారు. అత్తిలి పరిసర గ్రామాల ప్రజలందరికీ అందుబాటులో ఉండే అత్తిలి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లు ఆపేవిధంగా ప్రభుత్వ పెద్దలు చొరవ చూపాలన్నారు. సీపీఎం జిల్లా జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ అత్తిలి మండలంలో ప్రతి సంవత్సరం అధిక వర్షాలు కారణంగా సార్వా పంట తిరుపతిపురం, వరిఘేడు, బల్లిపాడు, మంచిలి, ఈడూరు గ్రామాల్లో పొలాలు ముంపుబారిన పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డెల్టా ఆధునీకీకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేసారు. తొలుత పార్టీ పతాకాన్ని సీపీఎం సీనియర్ నాయకుడు దాయి వెంకన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి బ్రహ్మ, కె ధర్మేంద్ర, కె కుమారి, ఎం రామాంజనేయులు, వీరభద్రం, బొట్టా అప్పారావు, మట్టా సూర్యారావు, దాయి వెంకన్న, తలారి విష్ణుమూర్తి, పాలమూరు ఉప్పరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెంటినరీ దినోత్సవం


సండేస్కూల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: గూడెం టౌన్ ఎ.క్లాస్ ప్యారిష్ చర్చి ఏర్పడి 129 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్థానిక చర్చిలో సెంటినరీ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. స్థానిక గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్, సహాయగురుమండల అధ్యక్షుడు రత్నాకర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గూడెం టౌన్ లూథరన్ చర్చి 1895 డిసెంబర్ నెలలో ఏర్పడిందన్నారు. దీనికి గుర్తుగా ఈ చర్చిని సెంటినరీ లూథరన్ చర్చిగా నామకరణం చేశామన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం సండే స్కూలు చిన్నారుల క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. లూథరన్ సభ్యులు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాలకవర్గ సభ్యులు, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు, డెలిగేట్స్, యూత్, స్త్రీల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేప చెట్టుకు పూజలు

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారి తోటలో వేప చెట్టుకు పాలు కారడంతో భక్తులు భారీగా తరలి వచ్చి పూజలు చేస్తున్నారు. గ్రామంలోని పులపర్తి సత్యనారాయణ అనే యజమాని తోటలోని ఓ వేప చెట్టుకు సోమవారం ఉదయం నుంచి పాలు ధారగా కారుతున్నాయి. స్థానికులకు సమాచారం అందించడంతో గ్రామస్తులు, వేప చెట్టుకు పూజలు ప్రారంభించారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి


తణుకులో ప్రపంచ ఎయిడ్స్ డే వారోత్సవాల్లో మాట్లాడుతున్న హెచ్‌ఎం పద్మావతి

తణుకు అర్బన్: ఎయిడ్స్ వ్యాధి పై యువత అవగాహనతోపాటు అప్రమత్తంగా ఉండాలని తణుకు జెడ్పీ బాలుర హైస్కూలు హెచ్‌ఎం కె.పద్మావతి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన వారిపట్ల వివక్ష చూపరాదని అన్నారు. ముందుగా పదడుగుల ఎత్తైన రెడ్ రిబ్బన్‌ను ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు అక్కింశెట్టి రాంబాబు, ఉమాదేవి, పాల్ డేవిడ్‌రాజు, వెంకటలక్ష్మి, సులోచన, రాధాకుమారి, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, మాధవీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాహక్కుల సభను విజయవంతం చేయండి

తణుకు టౌన్: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ 6 హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు టీ అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఈనెల 4వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా హక్కుల సదస్సును విజయవంతం చేయాలని గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులకు ఆరోగ్య బీమా వర్తింప చేయాలన్నారు. విద్య, వైద్య రంగాలలో ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈనెల 4న విజవాడలో జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరారు. ఈసభకు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. ఈకార్యక్రమంలో పీ నాగమల్లి, పీ శివ, బీ మహేష్, బీ రాము పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

తణుకు టౌన్: ఈనెల 5వ తేదీన జరిగే ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్టీయూ, ఏపీటీఎఫ్ తదితర ఉపాధ్యాయ యూనియన్లు బలపర్చిన గందం నారాయణరావును గెలిపించాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఇతర నాయకులు తణుకు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఎస్టీయూ నాయకులు సీహెచ్‌జీవీ సుధాకర్, జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, నాళం రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ కాంతులతో లూథరన్ చర్చి


పెంటపాడు టౌన్ ఎ.క్లాస్ సెంటినరీ ప్యారిష్ చర్చి విద్యుత్ కాంతులీనుతున్న దృశ్యం

పెంటపాడు: క్రిస్మస్ వచ్చింది... పండుగ తెచ్చింది అంటూ క్రైస్తవులు ఎంతో సంతోషంగా జరుపుకొనే క్రిస్మస్ పండుగ రానే వచ్చింది. ప్రతి సంవత్సరం డిసెంబర్ 1 నుంచి జనవరి 1 వరకు ఈ పండుగను పలువురు ఆచరిస్తారు. అయితే నియోజకవర్గంలో క్రిస్మస్ పండుగ ప్రారంభమైంది. దానికి సూచనగా నియోజకవర్గంలో పలు డినామినేషన్‌లకు చెందిన చర్చిలు విద్యుత్ కాంతులతో అలంకరిస్తున్నారు. ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. క్రిస్మస్ నాటికల పేరుతో రిహార్సల్‌లు చేస్తూ సందడిగా ఉంది.

దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు


దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో ముందుస్తుగా దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. దివ్యాంగులకు పరుగు పందెం, క్యారం బోర్డ్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్ తదితర పోటీలు జరిగాయి. భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో మంగళవారం విజేతలకు బహుమతులు అందజేస్తారని వివరించారు.

శివశంకరా.. జ్యోతిర్లింగేశ్వరా


చినతాడేపల్లి గ్రామంలోని శివాలయం వద్ద కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: కార్తీక మాసం చివరి రోజు కావడంతో సోమవారం మహిళలు మండలంలోని శివాలయాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పోలి స్వర్గానికి పంపించే కార్యక్రమాన్ని మహిళలు నిర్వహించారు. కార్తీకమాసం పూజలు మహిళలు ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం చివరి రోజు సోమవారం రావడంతో తెల్లవారు జాము నుంచి పలు శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు చేశారు. మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చినతాడేపల్లి, వీరంపాలెం, నవాబుపాలెం, జగన్నాథపురం, మాధవరం, కొండ్రుప్రోలు, కుంచనపల్లి, పెదతాడేపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు కార్తీక దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు


తణుకులో బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: తణుకు మండలంలో బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. తణుకు మండలం కోనాల గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న గద్దం చింటు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణపై కఠినచర్యలు తీసుకుంటున్నామని, మద్యం కొత్త పాలసీ అమలైన తర్వాత ఇప్పటివరకు 20 బెల్టు షాపులపై కేసులు నమోదుచేసి 21 మందిని అరెస్టు చేశామని, వారి నుంచి 236 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం తెలిపారు. మండలంలోని పెదకాపవరం శివారు దండగర్ర గ్రామం నుంచి ఆలకోడు పుంత రోడ్డును విస్తరింపజేసి దండగర్ర కాలువపై వంతెన నిర్మించాలని ఆ ప్రాంత రైతులు ఫిర్యాదు చేశారన్నారు.